ఇది మామూలుకథల్లాగానే మొదలైంది.

"ఏం నమ్మకం లేదా? యీ బల్లగుద్ది మళ్ళీ చెప్తాను విను. నేను రత్నమాలని ప్రేమిస్తున్నాను."

"పండగరోజు ప్రొద్దున్నే ఏమిటోయ్!" విసుక్కున్నాడు గోపాలం.

"పండగరోజు ప్రొద్దున్నే ప్రేమించొద్దని నిషేధించారా?"

"అదికాదు; ఉగాదినాడుకూడా యీ సోదియేమిటని!"

"ఉగాదినాడే యీ సోది మాట్లాడుకోవాలి. యివాళ ప్రేమిస్తే సంవత్సరమంతా ప్రేమిస్తూనే ఉంటాం. ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును. యీ ప్రేమ యిలా చక్రవడ్డీలో పెరిగిపోతే యింక అసలు యుద్ధమే ఉండదు......సరే. అదంతా వేరే గొడవనుకో. యింతకీ నేను రత్నమాలని ప్రేమిస్తున్నాను."

"మంచిపని చేశావుగాని, ఆ గోల నా దగ్గిరెందుకు! ఏనుగుమీద ఊరేగించమంటావా, తాషామర్పా వాయించి!"

"నీదగ్గిర కాకపోతే యింకెవరి దగ్గిర చెప్పుకోను! మనిద్దరం బడి చివరి తరగతి ఆరేళ్ళు కలిసి చదివాం. మనిద్దరికీ జలాలబాదీ కవిత్వం అంటే యిష్టం. యిద్దరం నజ్మానియాజీ పాటంటే పడిచస్తాం. మరి యింకా, నీకూ నాకూ షిర్లీ మెక్లైన్ అంటే మోజు. యిన్నిట్లో ఒకే మాదిరి అభిప్రాయాలు గలవాళ్ళం గాబట్టి నా బాధ నీ కర్థమౌతుందని ఆశ...... యింకేం చెప్పను చెప్పు."

"యింకేం చెప్పక్కర్లేదు, పో!"

"యెంత బండరాతి గుండెరా నీది? ఆప్తమిత్రుడు ప్రేమ యిబ్బందిలో పడి ప్రాథేయపడ్తూంటే 'పో' అనేవాడి గుండె, గుండెకాదు నల్ల బండ గాని!" రాగం తీశాడు బాలు.

"నీకుతోడు పద్యపఠనంగూడానేమిటి? నువ్వు చేసిన పనికి అసలు యింటోకి రానిచ్చి మాటాడ్డమే గొప్ప!"

"ఏదో తమాషా అనుకున్నాను గాని నువ్వింత మరీ ఆడపిల్లలా యిదవుతావనుకోలేదు! ఏమైనా అసలిప్పు డిక్కడికి వచ్చిందందుకే. తప్పు చెయ్యడం మానవీయం అన్నారెవరో ఆంగ్లేయులు... కొంచెం మరీ ఊపులో ఉన్నవేళ చేసిన పాపానికి యింకసలు యెప్పటికీ నిష్కృతి అంటూ లేకపోతే యెలా చెప్పు!... యిది కాలు గాదనుకో!"

బాలు యెందుకన్నా మంచిదని గోపాలం మోకాలుమీద గట్టిగా నొక్కుతూ పెద్దపెద్ద మాటలు ప్రయోగించాడు.

"క్షమించాను, వదులు......అరే వదలరా అంటే!" గోపాలానికి నవ్వొచ్చింది.

"ఊరికే క్షమించి ఊరుకుంటే కుదర



డి. హనుమంతరావు B.E

రదు. నువ్వెళ్ళి అస లలాంటి
దేం జరగలేదని ఆమెతో
చెప్పి, ఆ తర్వాత వీలునిబట్టి
నా గురించి కొద్దిగా పొగడాలి!''

''మతి లేకపోతే సరి! ఊర్లో కనబడ్డ ప్రతీ పంకజమ్మనీ నువ్వు ప్రేమించడం, నీ వెనకాలే నేను వెళ్ళి వాళ్ళందరి దగ్గిరా నిన్ను పొగడ్డమూనా?...యింతకిన్నా కోర్టు కెళ్ళడమే హాయి!" గోపాలానికి మళ్ళీ విసుగొచ్చింది.

''నీఅంతటి వాడలా అనడం ఏంబాగా లేదు గోపాలం! యింకొక డెవడన్నా నీలా మాట్లాడితే 'ఛా, నీ లెక్కేమిట'ని లేచి వెళ్ళిపోయుందును! కాని...మీ నాన్న యెంతటి వారు! ఆ మాటకొస్తే మీ తాత! అలాంటివాళ్ళ నెక్కడా చూడ లేదనేవాడు మా తాత ... నువ్వు మాత్రమేం తక్కువ తింటున్నావా? నువ్వూ నిన్నటిదాకా శిబి, కర్ణుడు, గాంధి, శ్రీరాములులాంటి వాడివే. యివాళే, యేమిటో ... యేం రాధాదేవిగారింట్లో లేరా?"

''ఆవిడ పేరు రాధ. అంతే. దేవి, రాణి, బాయి, కుమారిలాంటి వేం జేర్చకు ... తైరులో కొత్తపద్ధతు లొచ్చాయి, తెలియదుగాబోలు! యింకా పాతవే పట్టుకు వేలాడుతున్నావు!'' నవ్వాడు గోపాలం.

నవ్వాక మెత్తబడ్డాడు. హృదయం ద్రవించింది.

కాసేపు భయంకర నిశ్శబ్దం.

''యింతకీ యెవరా రాట్నాలానా?" పేపర్లోకి చూస్తూ అడిగాడు.

"రాట్నాలానా అనేది కాలంలో విమానాశ్రయం. నేను ప్రేమించేది రత్నమాల అనే ఓ అమ్మాయిని"

''పోనీ రత్నమాలే. ఎవరామె?''

"ఎవరో యింకా అడగలేదు. మొదటిసారి అజంతా ప్రదర్శనా స్థలంలో చూశాను. ఆ తర్వాత అబీదు కేంద్రంలో కనబడినప్పుడు నవ్వాను.' ఆ తర్వాత ''స్వేచ్ఛ" అనే చలనచిత్ర సావిడిలో నాలుగు మాటలు. మొన్న 'కలాభూమి' అనే మరో సావిడికి యిద్దరం కలిసి వెళ్లాం...యేం! ఆ మాత్రం చాలదూ!"

"చాలకనేం, యిప్పటికే గంపెడయింది!...అదిసరేగాని, 'స్వేచ్ఛ' అనే చలనచిత్రసావిడి, అంటావేమిటి? ఏమిటాభాష?

"తెలుగు కథల్లో యింగ్లీషులో మాట్లాడకూడ దన్నారెవరో."

"యిదో వికారంకూడా నేమిటి...ఏం చెయ్యమంటావు నన్నింతకీ?"

"ఆవిడలో నాది చాలా తీవ్రమైన, గంభీరమైన, బరువైన బుర్ర అనే అభిప్రాయం నాటుకునేట్టు చేయాలి!"

''నీ కసలు బుర్ర అంటూ ఒకటేడిసిందని ఆ అమ్మాయి అనుకుంటూందని నమ్మకంగా తెలుసానీకు?"

"అజ్ఞానం! నేనంటే నీకింతటిపేద అభిప్రాయం ఉందని కలలోకూడా అనుకోలేదు!"

"నీ భావాల్ని నువ్వుమళ్ళీ మామూలు భాషలో చేస్తేనేగాని మాట లర్థంగావడం లేదు."

"యింతకీ నువ్వు పెద్దచెయ్యాల్సిందేం ఉండదు. వీలైనపుడు ఆమెని నీకు పరిచయంచేస్తాను. ఆమె మనగొడవ అడుగుతుంది. 'ఛా, అలాంటిదేం జరగ లేద'ని దబాయించాలినువ్వు. ఆవిడది అతి సున్నితహృదయం. ప్రయోగాత్మక హాస్యంఅంటే కిట్టదు. మనసంగతి ఆవిడ కెలాగో తెలిసింది. ఎలాగో ఏమిటి, ఆ చీనా మొహం! వాడే చెప్పుంటాడు! వాడూ ఆవిడనే ప్రేమిస్తున్నాడులే?"

"యిందులో మళ్ళీ పోటీగూడా నేమిటి?"

"పోటీలేనిదే ప్రేమస్థాయి పెరగదు."

"ఊహూఁ! స్థాయిపెరగడానికి ఏం చేస్తున్నావు?"

"మనసంఘ వార్షికోత్సవమంటూ..."

"మనకి సంఘం ఎక్కడేడిసింది?"

"అదేనోయ్, మన వాగబాండ్స్‌క్లబ్ వార్షికోత్సవం అంటూ రేపుమనవాళ్ళేదో ధమధమలాడిస్తారుగా! ఆ సందర్భంలో సంగీతంపోటీ లేర్పాటు చేస్తామని చెప్పింది, లలితకళావిభాగం కార్యదర్శిని గారు- ఆవిడ పేరేదో ఉంది- ఆఁ, భీత హరిణేక్షణగారు!"

"యీపీత పరిరక్షణగారెవరు?"

"పీత పరిరక్షణాగాదు, చేప ఉప లక్షణాగాదు! భీతహరిణేక్షణ! మన వెంకట బాలనరసమ్మగారు యెంతోకాలం నుంచి పేరుబాగాలేదు, మార్చుకోవాలని ప్రయాస పడుతున్నారు. యిలా ఉండగా ఒక దత్తాత్రేయులుగారు ఆమెకెదురై 'మీ కళ్ళు పరుగెత్తే లేళ్లలా ఉన్నాయ'ని మెచ్చుకున్నారు. ఆ వెంటనే, 'యివ్వాళ్టి నుంచీనేనీ పేరుతో పిలువబడుదునుగాక!' అంటూ ఆవిడో పత్రికాప్రకటన చేసే సింది!... ఆ గొడవ వేరేవుంచు... ఆవిడనిర్వహించబోయేసంగీతంపోటీలో నేనుపాడేపాట రత్నమాల గుండె వీణ తీగెల్నిమీటి శంకరాభరణమో, బ్రహ్మా భరణమో.- నాకురాగాలు. బాజాలు రావని నీకుతెలుసు- మ్రోయిస్తుంది!"

గోపాలాని కంతా చీకటనిపించింది. దిక్కుతోచనట్టయింది. నివ్వెరపోయాడు.

"ఏమిటి, నువ్వా, పాడతావా?" కాసే పటి కడిగాడు.

"ఏం, అలా మూర్ఛపోతావు? ఏదో ఊగు మరియు దొర్లుపాట పాడతానను కుంటున్నావు గాబోలు! నేనుపాడేపాట మూగరాత్రి చీకటి నీడలాంటి బరువు మాటలమీద పోతుంది. అదివినేవాళ్ళ గుండెబరువు చెప్పలేనంత అయిపోయి ఊబిలాంటివిషాదంలోకిదిగినట్టుంటుంది. రత్నమాల గుండెసంగతి చెప్పనే అక్ఖ ర్లేదు. అసలేదూరంగా యెక్కడో చూసే

ఆ లోతుచూపులు యింకా యెక్కడో ఆకాశం అవతలికి చూస్తాయి."

"మూగ రాత్రేమిటి? చీకటికి నీడేమిటి?''

"ఒక వర్ధమాన బరువుకవిరాసిన గేయమది. అర్థం రాసినాయనకి తెలుసునేమో! కాని యీ మధ్య ప్రజలంతా భళాభళీ అని తెగ మెచ్చుకున్నారు!"

"సర్లేగాని; యింతేనా! యింకేమన్నా ఉందా!...నాకు లోపల పనుంది.''

''భయంకరంగా విచారం, గోపీ!''

"'ఆపుల్లీ సారీ, గోపీ' అనడానికి వచ్చిన తిప్పలా?"

''తెలుగు భాషని మురికి చేస్తున్నావు. చెంపలేసుకో.''

బాలు వెళ్ళిపోయాడు.

"ఎవరితోనూ మాట్లాడుతున్నారు, యింతదాకా?" రాధ చేతులు తుడుచుకుంటూ గదిలో కొచ్చింది.

''రత్నమాల తోటి.''

''ఉహూ. యిదెప్పట్నుంచి?"

"మొన్న అజంతా పెవిలియన్లో చూచినప్పటిట్నుంచి."

''ఏమంటుంది:''

"ప్రేమించానంటుంది.''

''ఎవర్ని. మిమ్మల్నే?'' రాధ మొగం నిండా ఆశ్చర్యం పులుముకుంది.

''కాదు, బాలూని.''

''మరి, మిమ్మల్నేంచెయ్యమంటుంది?''

గోపాలాని కర్థంగాలేదు. ఆలోచనల్లోంచి అప్పుడే బయటపడ్డాడు.

"'చెయ్యమంటుంది' అంటావేమిటి? బాలు స్త్రీలింగంకాదు—బొత్తిగా గ్రామరు కూడా మర్చిపోతున్నట్టుందే!''

''మీ దగ్గిరకొచ్చింది రత్నమాల అన్నారుగా!"

"రత్నమాలని బాలు ప్రేమిస్తున్నాడన్నాను. యిక్కడి కొచ్చింది బాలు."

"మీరేం మాట్లాడుతున్నారో మీకే తెలియదు!''

"చెప్పేది వినిపించుకోడం చేతగాకపోతే సరి!"

"యిదెప్పుడు కనిపెట్టారు'''

గంట మ్రోగింది.

''రండి.'' రాధ వెళ్ళి భ్రమరగార్ని పిల్చుకొచ్చింది.

''నమస్కారమండీ.'' గోపాలం లేచి నిలబడి ఆమె కూర్చున్నాక మళ్లా కూర్చున్నాడు.


''మా తమ్ముడిలా వచ్చాట్టగదండి." భ్రమరగారు అడిగింది.

"మీ తమ్ముడిలావచ్చి వెళ్ళిపోడం గూడా అయిపోయిందండి.''

"అది తెలుస్తూనే ఉందనుకోండి. ఏమంటాడు?''

"రత్నమాలని ప్రేమించానంటాడు."

''ఎవరా రత్నమాల?"



"ఒరే, చిట్టీ, మీ అక్కయ్య యింకా ఎంత సేపటికి వస్తుందిరా ?"

"మొన్నే ఎం. ఏ. పాసయి 'భారత వేదాంతతత్వంలో మిథ్యావాదం' గురించి పరిశోధిస్తోంది. యీ ఊర్లోగాదు. యెక్కడో. యీ ఊర్లో ఓనెలో రెండు నెలలో ఊరికే ఉండడానికి వచ్చింది వాళ్ళ నాన్నారి దగ్గిరికి. వాళ్ళ నాన్నారు యీ ఊర్లో ఏదో కంపెనీకి డైరెక్టరు.''

"మీరూ యెరుగుదురా ఆమెని ?"

''ఎరగనండి. కాని, మీ వాడు చీనా మొహ మంటూంటాడు ఓ వెడల్పాటి మొగమున్న డాక్టర్ని. వాడ్నంతా 'డిక్కీ' అంటూంటారు. డిక్కీ అంటే డికిన్సన్ లాంటి దొర అనుకునేరు ! అదేంగాదు ! దీక్షితులని గోదావరి జిల్లావాడే. ఆ డిక్కీ కూడా ఆమెనే ప్రేమించడంచేత నాకు తెలిశాయి ఆమె వివరాలు ... డిక్కీ నేనూ ఒక రైల్లోనే కొంతకాలం ప్రయాణించడంవల్ల పరిచయమైంది.'?

"యింతకీ ఆమె మా వాడికెలా తెలుసు ?"

"మీవా డామెని పబ్లిక్ గార్డెన్స్‌లో చూశాడు. ఆ తర్వాత అబిడ్స్ దగ్గిర నవ్వాడు. లిబర్టీలో మాట్లాడాడు. క్రీం లాండ్‌కి తీసికెళ్ళాడు. అంతే. ఆనక ప్రేమించాడు. ఆవిడ పూర్తి వివరాలింకా తెలియవుట."

"ఇదెక్కడి గొడవండి? మొన్న మా ఆశాలతలేని ప్రపంచమంతా చీక టన్నాడు. సరేనని వాళ్ళ బావగారితో మాట్లాడి ముహూర్తంకూడా పెట్టించేశాం. యిప్పుడు మళ్ళీ యీ రత్న మా ల అంటాడేం ఖర్మ!''

"యిలా చూడండి. మీ తమ్ముడి సంగతి మీకన్న నాకు బాగాతెలుసు. బాలు పదహారేళ్ళప్పుడు మొదటిసారి ఒక హిందీతారని ప్రేమించాడు. అప్పుడు మొదలు రోజువిడిచి రోజు ఏవరో ఒక కొత్తఅమ్మాయిని ప్రేమిస్తూనే ఉన్నాడు. యాభైతొమ్మిది ఫిబ్రవర్లో మద్రాసులో శకుంతలని, ఏప్రిల్లో వాల్తేర్లో మెహ రున్నీసా బేగంని, అరవై జూలై. కర్నూల్లో వత్సలని, అరవై ఒకటి నవంబరులో సికింద్రాబాద్ నుంచి బెంగు ళూర్ పోతూ రైల్లో 'దీనా' అనే ఓపార్సీ అమ్మాయిని, అరవై రెండు ఆగస్టులో యీ వూళ్లో ఎదురింటి రాజీవలోచనని మాత్రమే కాస్త నిఖార్సుగా ప్రేమిం చింది...యింక యీ ఆశాలతలూ, రత్న మాలలూ యెంతమందో చెప్పక్కర్లేదు."

"అదేం కుదరదండి. ఇక్కడితో యీ ఆటకట్టించాలి. యీ పెళ్ళి జరగాల్సిందే.''

''మీ తమ్ముడనే అభిమానం ఉండడం సహజమే ననుకోండి. కాని ఉన్నమాట చెప్పుకోవాలి. మీ పరిస్థితిలో నేనుంటే ఆశాలతని బాలుకిచ్చి పెళ్ళి చెయ్యను. ఎందుకంటారా? బాలు అంతనమ్మదగిన మనిషిగాదు. మే మిద్దరం యింత సన్ని హితంగా ఉంటాంగదా: ఒకసారేం చేశాడంటే...''

''గోపాలం గారూ! మీ అనుభవా లన్నీ ఆత్మకథకింద వ్రాసి ప్రచురించండి. వీలైనప్పుడు చదువుకొని ఆనందిస్తాం. ముందీ గొడవ తేలనియ్యండి.''

గోపాలం నిరుత్సాహ పడ్డాడు.

''అలాగేనండి. మాట్లాడతాను, వాడితో."

''మీరు మాట్లాడితే మారతాడనుకోను.. రాధగారూ! మీరేయేదో ఎత్తువెయ్యాలి.''

"ఇప్పుడే వస్తానుండండి." రాధ నవ్వుతూ లోపలికి పోయింది.

రాధ లోపలికి వెళ్ళాక గోపాలం మొదలెట్టాడు.

''వెనకోసారి మీ వాడూ నేనూ దేశం మీదపడి రెండు మూడు నెలలు డబ్బు తగలబెట్టి వచ్చాం. మీకు తెలుసునో తెలియదో!''

''తెలియక పోవడమేం? అంతా తెలుసు.''

"సరిగ్గా హోళీ నాటికి బొంబే చేరాం. అదేదో హోటల్లోమకాం. ఆ రాత్రి హోటలు స్విమ్మింగ్పూలులో ఎవరో డకింగ్ పార్టీ ఏర్పాటు చేసుకున్నారుట. నీళ్ళనిండా పెయింట్లు, వార్నిషులు,

యింకా రకరకాల దురద పుట్టించేవి, బట్టలన్నీ పాడు చేశేవి ఆయిల్సు వగైరా ఏవేవో పోశారు. పార్టీకింకా వేళకాలేదు. మేమిద్దరం సరిగ్గా అలా వేళ్లాం. నేనప్పుడు ఎలా ఉన్నానో చెప్పమంటారా? డార్క్ గ్రే గాబర్డీన్ పాంటులోకి సాఫ్ట్‌వైటు టెరిలిన్ షర్టు టకిన్ చేసి, షార్క్‌స్కిన్ కోటు, చేతగిలించుకునున్నాను. నైలాన్ సాక్స్, ఫ్లెక్స్ ఎంబాసిడర్ బూట్.

"నీళ్ళపైన అడ్డంగా బ్రాస్ ట్యూబ్సు తగిలించి ఉన్నాయి. వాటినుంచి దూర దూరంగా వేలాడే గొలుసుల చివర రబ్బరు స్ట్రాప్స్. 'ఆస్ట్రాప్ పట్టుకుని యీ వైపునుంచి ఆవైపుకి దూకగలవా?' అన్నాడు మీవాడు. 'దూకగలవా?' అంటే చూడండి, యెలాంటివాడికైనా పౌరుషం పొడుచుకొస్తుంది. పైగా మీ వాడు ఖచ్చితంగా 'దూకలేవు' అని కూడా అనేశాడు. పందెం కాశాం. అంత మరీ వెడల్పుగా లేదు. ఒక గొలుసు పట్టుకు 'హూప్' మని ఉరికాను. క్షణంలో అవతలికివెళ్ళిపోయేవాడ్నే. యింతలోమీవాడు ఎక్కడ్నుంచి తెచ్చాడో ఓ చేతి కర్ర తీసుకొచ్చి గొలుసుపైన కొట్టాడు. అంతే. యింక అది అక్కడే అటూ యిటూ రెండుమూడుసార్లు ఊగి ఆగిపోయింది. మధ్యగా ఎంత గింజుకున్నా యెటూ కదల్లేదు. జనం మూగారు. గోల చేశారు. నవ్వులు, కేకలు, ఒకటే కోలాహలం. యింక చేసేదిలేక నీళ్ళలో కురికేశాను. బట్టలు పాడవడ మొకటే గాదు; వారం రోజులు క్లినిక్‌లో జేరి, డబ్బయిపోయి. మామయ్యకు రాసి, – ఎంత అవస్థ: చూశారా, మీవాడెలాంటి వాడో! అలాంటి వాడికి ఎంత తమ్ముడైతే మాత్రం మీ అమ్మాయి నెలా యిస్తారు చెప్పండి?"

"నిక్షేపంలా యివ్వచ్చు. అసలు మావాడి కింత తెలివితేట లున్నాయనుకో లేదు!" భ్రమరగారు నవ్వింది.

"మీ యిష్టం!" గోపాలం గొణుక్కుంటూ కిందికి చూశాడు.

రాధ ట్రేలో సాసర్లూ, కప్పులూ పెట్టుకొని తీసుకొచ్చింది నవ్వుతూ.

"మీవారి లీలలు విన్నారా?"

"లక్షసార్లు. ఒక్కసారిచెప్పి ఊరుకోరు. మళ్ళీ మళ్ళీ చెప్పిందేచెప్పడం!" రాధ ముచ్చటగా విసుక్కుంది.

"షట్ యువర్ ట్రేప్–యు––సిల్లీ" గోపాలం కోపంగాచూశాడు. రాధ తలదించుకుంది.

భ్రమరగారు తబ్బిబ్బైంది. కాసేపు యెవరూ మాట్లాడలేదు.

"ఆ మాటకేంగాని, మీరెలాగైనా గోపాలంగారూ, మావాడా రత్నషాల ప్రేమబంధాన్ని త్రెంచుకుని బయటపడే

మార్గమాలోచించాలి. రాధా! వెళ్తానింక." నెమ్మదిగా జారుకుంది.

మళ్లీ నిశ్శబ్దం.

"యిది బలేగొడవే! '' గట్టిగానవ్వి అన్నాడు చివరికి, రాజీపడుతున్నట్టు.

రాధ మాట్లాడలేదు, తలయెత్తలేదు.

"రాధా!'' మొగంలో మొగంపెట్టి పిలిచాడు గోపాలం. రాధ కదలలేదు, పలకలేదు.

''పోనీ, 'రాధారాణీ!' అనిపిలవనా, బాలు అన్నట్టు?"

రాధ నోరు విప్పలేదు. కళ్ళు తిప్పలేదు.

''ఏయ్, నీతోనే మాట్లాడేది.'' చెయ్యిపట్టుకు కుదిపాడు,

"పోండి, నాతోమాట్లాడకండి,''

''అలకా, నారాణీ?" గోపాలంనేల మీద రాధముందు మోకాళ్ళమీద ఆని శిక్షవిధించమన్నట్టు చేతులు చాచాడు.

''యిలా దొంగవేషాలు వేయమంటే ఫస్టు!'' రాధ నవ్వేసి గోపాలం తలని ఒళ్ళోకి లాక్కొంది.

"నువ్వు మాట్లాడకపోతే నేనింక బతగ్గలనా చెప్పు!'' రాధ చేతివేళ్లు తలలో మెల్లిగా రాస్తుంటే మత్తుగా కళ్ళు మూసుకున్నాడు గోపాలం.

''యిదొహటి పైగా! చాల్లెండి, ఎవరన్నా వింటే నవ్వుతారు!" గోపాలం చెంపని ఒకటి మెత్తగా తగిలించింది రాధ.


''నవ్విన వరిచేనే పూయదా!''

''యిప్పుడావిడెదురుగ్గా యేమన్నారు! ఆవిడ చెయ్యి మహా చెడ్డది తెలుసా?"

"చెడ్డ నోర్లుంటాయిగాని; చెడ్డ చేతులుకూడా ఉంటాయని నాకేం తెలుసు!''

''అంటే, ఆవిడ కథలు. వ్యాసాలు వగైరా రాస్తుందని అర్థం. ఏదో మంచి రోజు చూసి 'కొందరు భర్తల అసభ్య దుష్ప్రవర్తన' అని శీర్షికపెట్టి ఏ వార పత్రికలోనో వ్యాస మొకటి దంచిపారేస్తుంది మీ మీద. లేకపోతే యే నవల్లోనో ఓ పరమ దుర్మార్గుడినీ, రోజూ పెళ్లాన్ని ఉతికే వాడిని. ఓ లావాటి గండు మీసాల విలన్ని ప్రవేశపెట్టి వాటికి మీ పేరు పెట్టేస్తుంది! అంతే! దెబ్బతో మీకీ ఊరునుంచి పార్లమెంటుకి పోటీ చెయ్యా దగ్గంత పేరు. ఖ్యాతి వచ్చేస్తాయి. రోడ్డుమీద పోతుంటే జనమంతా విరగబడి, ఫలానా ప్రఖ్యాత రచయిత్రి యీ యన్ని చూశాకనే ఆ దుష్టుడి పాత్ర అంత చక్కగా చిత్రించింది అని కళ్లు తాటికాయలంత చేసుకుని చూస్తారు! నాకేం!"

''ఓరి బాబోయ్! యింత లోతుగుంటలుంటాయని నేనేం కలగన్నానా?



"వెధవ హైకమాండు, లాస్ట్ మినిట్‌లో నన్ను డ్రాప్ చేశారు. ముందుగా తెలిసుంటే స్వతంత్రపార్టీలోనైనా కలిసేవాణ్ణి."

దూరపు కొండలు నునుపంటారు, యిందుకేగాబోలు !"

"యిక్కడ ఆ సామెత అతకదు !" రాధ నవ్వింది.

"పోనీలే యేదో ఒకటిగాని. యింతకీ ఆ రత్నమాల బారినుంచి బాలుని కాపాడ్డమెలాగా ?"

"నిజమే. ఆమిధ్యా వేదాంతపండితు రాల్ని గట్టుకుని యితగాడేం సుఖపడ్తాడు ?"

"రేపు 'నువ్వులేవు, నేనూలేనూ; నీదారినీది, నాదారినాది' అన్నా అనే యెచ్చు !''

"కాబట్టి, నేనోప్లాను వేశాను !"

"నాకుతెలుసుగా; నీ కప్పుడే యేదో తట్టుతుందని ! అసలు యీ ప్రపంచంలో నువ్వు తప్పించి మిగతావాళ్ళందరి బుర్రలూ కలిపి త్రాసులో యీ వైపు పెట్టామనుకో. అతలవైపు నీ బుర్ర ఉంచాం. అంతే. క్షణంలో యీ ప్రపంచంలో బుర్రలన్నీ కలిసి ధన్‌మని సూపర్ సానిక్ స్పీడ్‌లో చంద్రమండలానికెగిరిపోతాయి.'' రాధ మెడవంచి నుదుటిమీద పెదాల్తో అద్దాడు గోపాలం.

"అబ్బ ఉండండి...పూర్తిగా వినండి.''

"యింక వినక్కర్లేదు. ఎప్పుడేం జరగాలో అంతాను వ్వే నిర్ణయించేసి

సరిగ్గా ఆక్షణంలో చెప్పు. చేసేస్తాను. అంతే మాటలెందుకింక నోటిఖర్చు?''

ఆ తర్వాత వాళ్ళేం చేశారో మన కనవసరం.

సరిగా వారంరోజులు గడిచాయి.

యీ లోగా బాలూ, గోపాలానికి రత్నమాలని పరిచయంచేశాడు. గోపాలానిక్కూడా ఏకొద్దిగానో అందంగురించి తెలుసు. అయితే రత్నమాల గోపాలం దగ్గిర ఎక్కువ మార్కులు సంపాదించుకోలేక పోయింది. ఏదో ఆడదని ప్రేమించడం తప్పిస్తే బాలూ చేసినపనికి అంతగా అర్థమున్నట్టనిపించలేదు.

అయితే రత్నమాల పాట అద్భుతంగా ఉంది. గోపాలం ఆలా యెదురుగ్గా కూర్చున్న మనిషి అంత తియ్యగా పాడుతుండగా ఎప్పుడూ విన లేదు. ముఖ్యంగా ఆమె పాడిన బరువు గేయాలు గోపాలం గుండెనికూడా కొద్దిగా బరువెక్కించాయి.

''మీరు బాగా పాడుతున్నారు. నాకెంతో బాగుంది. యింకోసారి వినిపించండి." గోపాలం కొంచెం పెద్ద తరహాలో మెచ్చుకున్నాడు.

"ఎవరు నువ్వు?" అన్నట్టు చూసింది రత్నమాల.

బాలుకీ ధోరణి నచ్చలేదు. రత్నమాల అభిమానం, ఆత్మగౌరవం లాంటివి దెబ్బతిన్నట్టనుకుంటోం దని గ్రహించి తేలికపర్చాలని తాపత్రయ పడ్డాడు.

"రత్నమాల యూనివర్సిటీ తరపున ఢిల్లీ వెళ్ళి గాత్రంలో రాష్ట్రపతి పతకం గెలుచుకుందోయ్ !'' అన్నాడు "ఆవిడకి నీ యోగ్యతా పత్రం అక్ఖర్లేద''న్నట్టు చూస్తూ.

గోపాలాని కప్పుడే అర్థమైంది.

ఆ సాయంకాలం యింటికి రాగానే రాధ మొగంనిండా భయాందోళనల్లాంటివి చూశాడు.

"ఏమిట్రా నీ బాధ?'' బుగ్గ మెలేస్తూ అడిగాడు గోపాల.

"వేళాకోళం లాగే ఉంది, అవతల కొంపలు మునిగిపోతుంటే !''

"మునిగిపోయే కొంపల్ని నువ్వూ నేనూ కలిసి ఎలాగూ తేల్చలేం గాబట్టి, యేదీ, ఒక్కసారి...''

"రేపే సంగీతం పోటీ!"

"అయితే యేమంటావు?''

''రేపే రత్నమాల, బాలూ పెళ్ళి సంగతి తేల్చుకునేది !''

''అదెలాగ?"

''రేపు బాలుపాడే పాట రత్నమాల గుండెని కరిగిస్తుంది. ఆ తర్వాత వాళ్ళిద్దరూ కలిసి సినిమా కెళ్తారు. సినిమాలో అడుగుతాడు మెల్లిగా. ఆమె 'అంతా మా నాన్న యిష్టం' అంటుంది.

అంటే ఒప్పేసుకున్నట్టర్థం ... యింక ఆ పెళ్ళి ఆపడం మనిషితరం గాదు."

"ఇదేదో చైనా యుద్ధం కన్నా పెద్ద సమస్య. రెండు కాఫీలు కలిపి పట్టుకురా."

"రెండూ మీకేనా? నాకేమన్నా యిస్తారా?"

"రెండిట్లోనూ చెరిసగం. త్వరగారా. యుగళంగా ఆలోచిద్దాం."

"ఆలోచించాల్సిందేం లేదు. అంతా సిద్ధంగా ఉంది."

"అయితే ఒకటీ బై రెండు చాలు."

"ఏం లేదు, నేను చెప్పేది వినండి. రేపు పోటీలో యేదో వెలగబెట్టి అదేదో సినిమాలోలాగ రత్నమాల హృదయాన్ని దోచేయాలను కుంటున్నాడు బాలు. దానికి విరుగుడు ఆ దోచుకోడం ఆపు చెయ్యడం."

"సరిగ్గా పట్టాల్సినచోట పట్టావు."

"కాబట్టి రేపతగాడు పాడేపాట మీరు ముందువెళ్ళి పాడేయండి."

"డామిట్! ఏమిటి నువ్వనేది!"

"మీరు పాడాలి!"

"ఛ!"

"ఛ లేదు, ఛీ లేదు. మీరు పాడాల్సిందే!"

"అంతకన్నా స్టేజెక్కి గుంజీలు తియ్యమను, పదికాదు వంద తీస్తాను. అంతేగాని పాడమంటే నావల్లగాదు!"

"హుష్. అల్లరిచెయ్యకండా వినండి. లేకపోతే నా ప్లానంతా తలక్రిందు లవుతుంది."

"యిదా నీ ప్లాను! నన్నుపాడమనడం నీ కేమన్నా న్యాయమా! నన్నెందుకిలా క్షోభపెడ్తావు? నే నేంపాపం చేశాను.

"ట్రాజి-కామెడిలో హీరోయిన్లాగ జాలిచూపులు చూస్తూ ఏమిటా డైలాగు? మాట్లాడకుండా నేను చెప్పినట్లు చెయ్యండి."

"ఏమిటి పాడాలి నేనింతకీ?"

"యిదుగో రాసుకొచ్చాను; యీ రాత్రంతా కూర్చుని బట్టీవెయ్యండి. రేప్రొద్దున్నే ఓ రిహార్సల్ యిచ్చేస్తే సరిపోతుంది. సాయంకాలం మీరువెళ్ళి బాలుకన్నాముందు యిది అప్పజెప్పేస్తే సరి! జనమంతా విసిగెత్తిపోతారు. ఆ తర్వాత మళ్ళీ బాలు అదేపాడితే అంతా కలిసి చేసేగోల, చెప్పతరంగాదు. మన వాళ్ళు అసలేకోతులు. దాంతోరత్నమాల 'ఛీ. వీడ్నా పెళ్ళిచేసుకోడం!' అనుకుంటుంది! అనుకుంటుందా, అనుకోదా"

"అనుకుంటుందేమోలే గాని. మధ్య యిదోటి తెచ్చిపెట్టావుగదా నా ప్రాణం మీదికి!"

"అలా అనుకుంటే యెలా చెప్పండి! మావారు మంచివారుగదూ! ఊఁ, ఊఁ, ఊఁ,....." గోపాలం బుజాలమీద చెయ్యేసి గారాబంగా గునిసింది.

ఆ కళ్లలో ప్రేమాభిమానాలు తనకి వేసే సంకెళ్ళు త్రెంచుకోగలశక్తి గోపాలాని కెప్పుడూలేదు.

"ఏదాపాట ?"

రాధ ఓ కాగితం తెచ్చియిచ్చింది.

ఆ పాట నాలుగైదుసార్లు లోలోపలే చదువుకుని మొగమదోలా పెట్టాడు గోపాలం. రాధనవ్వింది.

"యిలాతెండి, నే నొ క సా రి పాడి వినిపిస్తాను."

మూగరాత్రి చీకటి నీడలో
నువ్వు రావాలన్న కోరికనే
నువ్వు వస్తావన్న ఆశగామార్చి
నేను కట్టిన యిసక మేడలన్నీ
నేలపాలయినాయి నా రాజా !
గాలిలో కలిశాయి నా దేవా !''

''ముందర మెల్లిగా తగ్గు స్థాయిలో మొదలెట్టాలి. ఆ తర్వాత 'కోరికనే' అన్న చోట గట్టిగా గొంతెత్తాలి మళ్ళీ తగ్గాలి. మళ్ళీ 'దేవా' అన్నప్పుడు, 'రాజా' అన్నప్పుడు గొంతు లేవాలి.''

"యీ లేవడం, పడుకోడం నాకు తెలియదు. నాకు తోచినట్టు నేను పాడతాను.''

''అలాఅంటే యెలాగ ?''

''ఏమో ! నాకు తెలియదు. నేను పాడితే యిలాగే పాడతాను. లేకపోతే అసలు పాడను.''

"సరే, పోనీ. మీ యిష్టంవచ్చినట్టే పాడండి."

"యింతకీ నేను ముందు వెళ్ళి పాడతూండగా బాలు వింటాడుగదా ? పరిస్థితి గమనించి వాడా పాట మార్చేస్తే... వాడసలే దుస్సాధ్యుడు. 'మూగరాత్రి చీకటి నీడ' అనడం మానేసి, 'గోల పగలు వెలుగుమనిషి'అని మొదలెడితే!''

''అదంతా నేను చూసుకుంటాన్లెండి. ఆ భీతహరిణేక్షణగారు నాకు బాగా తెలుసు. ఆవిడతో చెప్పి మీకూ ఇతనికీ మధ్య కొంత మందిని యిరికిస్తాను. యీలోపల బాలుని యెక్కడికో దూరంగా పంపిస్తాను. బాలు కిక్కడ మీరేం చేసిందీ తెలియకుండాచేసే పూచీ నాది."

ఆ మర్నాడు సాయంకాలం—

క్లబ్ హాలంతా గోలంగా ఉంది. గోపాలానికి తన పేరు మైకులో వినబడగానే యీగోలంతటికీ మధ్య లేచి నిలబడి నడిచివెళ్ళి వేదిక యెక్కి పాట పాడాలన్న తలపు గుండెల్లో హైడ్రొజన్ బాంబులు అయిదారింటిని పేలుస్తోంది. రాధ వలంటీరుగా అందర్తో నవ్వుతూ టాకుతూ ఎప్పుడూ బిజీగా తిరుగుతోంది, మాట్లాడ్డానికన్నా వీల్లేకుండా. అంతా యేమిటో అయోమయంగా ఉంది. ఇంకా గంట పైగా ఆలశ్యం ఉంటుంది. అసలు పాటలే యింకా మొదలుగాలేదు. యీ గంట గడవడ మెలాగ ?

చివరికి నాలుగు కృతయుగాలు వెళ్ళిపోయాక ఓ గంట గడిచింది. రాధ వచ్చి దగ్గిరుండి "ఆ చెమటలు తుడుచుకో" మని చెప్పి నడిపించుకెళ్ళింది. గోపాలం మైకు దగ్గిర నిలబడి తడారిపోయిన గొంతుతో లంకించుకున్నాడు:

"చీకటి రాత్రి మూగ నీడలో
నువ్వు రావన్న కోరికనే
నవ్వు వచ్చావన్న ఆశగా మార్చి
నేను కట్టిన నేలమేడలన్నీ
యిసకలో కలిశాయి నా దేవా?
గాలి పాలయినాయి నా రాజా!"

'కోరికనే' అంటూ గొంతు పైకెత్తబోయాడుగాని కీచుగా మారి ఉపసంహరించుకోవాల్సి వచ్చింది.

అంతా గొల్లుమన్నారు. యీలలేశారు. చప్పట్లు చరిచారు.

"యీ అవమానం అంతా పరార్థం కోసం గదా!" అని తనని తానే ఓదార్చుకుంటూ యెలాగోలాగ పాట పూర్తి చేశాడు గోపాలం. దిగి ముందుకు రావడానికి కొద్దిగా సిగ్గేసి అటు పక్కకి స్టేజి వెనక్కి వెళ్ళేసరికి రాధ నవ్వుతూ కనిపించింది.

"నేననుకున్న దానికంటే చాలా యెక్కువగోల చేశారే!" రుమాలు మొగంమీద అద్దుకుంటూ అడిగాడు గోపాలం.

"మీముందు అయిదారుగురు యిదే పాడి మీకన్నా యెక్కువగా ఖూనీ చేశారుదీన్నే!" రాధ నవ్వుతూ సమాధానించింది.

ఆ తర్వాత కొంత సేపటికి బాలు వచ్చాడు. బాలుయింకా పాట అందుకోకుండానే ప్రేక్షకులు లేచిపోయారు. యీలలు, చప్పట్లు. కేకలు, హాలంతా తిరణాలలా తయారయింది. అయినాసరే, బాలు ఝుమాయించి పాట పూర్తిచేశాడు.

రత్నమాల ముఖకవళికలు యెలా ఉంటాయో, యితని పాట ఆమెలో యెలాంటిమార్పు తీసుకొస్తుందోనని ఆమెకోసం వెదికాడు గోపాలం. యెక్కడా కనబళ్ళేదు.

"యిదుగో చూడు, నీ బుర్ర బొత్తిగా ఎంప్టీ అయిపోయిందీమధ్య"

"యిదెప్పుడు కనిపెట్టారు?"

"అలాచూడు రత్నమాల లేదు! యింక బాలుపాడినా ఒకటే, నేను పాడినాఒకటే. అనవసరంగా నన్ను క్షోభపెట్టావు — అసలు నీకు ఐడియాలు యిదివరకటంతటి చురుగ్గా రావడంలేదని నాకెప్పట్నుంచో అనుమానంగానే వుంది. అయినా ఏమిటో బుద్ధిగడ్డితిందివాళే.."

ఆక్షణం గోపాలం దిగ్విజయం సాధించిన వాడిలాగా రాధ అసమర్థతని అజ్ఞానాన్నిచీల్చి చెండాడుతూ ఉపన్యాసమిచ్చాడు.

"మీరింటికి వెళ్ళరూ, పుణ్యముంటుంది. నేనిది ఎలాగో తెములుచ్చకుని బయటపడ్డాను ;"

రాధ గోపాలాన్ని ఎలాగో పంపించేసింది.

ఆ మర్నాడుదయం. —

మంచం మీంచి లేవగానే ఫోన్ మోగింది.

"హలో, యెవరది ?"

"బాలు. గోపీ, ఒక చిన్నసహాయం చెయ్యాలినువ్వు."

"ఏమిటది, యీసారి రమామణిని ప్రేమించావా ?"

"అబ్బే అదేంకాదు, మా అక్కయ్యతోచెప్పి కొంచెం ఆ రత్నమాల గొడవ అణిగిపోయేలా చెయ్యాలి. రాధ గారితోచెప్పు."

"ఏం, ఏమయింది ?"

"ఏం లేదనుకో. ఆశాలతనే పెళ్ళి చేసుకోవాలని శాశ్వతంగా నిర్ణయించేశాను. వివరాలు తర్వాత" బాలు ఫోను పెట్టేశాడు.

"గాడ్ బ్లెస్ యు." గోపాలంఅన్న చివరిమాట అది. ఆ తర్వాత గంటదాకా మాటతోచలేదు.

యేమిటిది, యెలా జరిగింది ? రాధ సాధించిందా ?

"రాధే !"

రాధవచ్చింది.

"ఏమి టిదంతా యెలా జరిగింది ?"

"ఏంలేదు ; బాలు తను పాడినప్పుడు చేసిన గోలంతాచూసి యింక అక్కడ నిలబడకుండా యింటికి వెళ్ళి పోయాడు. కాసేపటికి రత్నమాలవచ్చింది. ఆవిడ కింటిదగ్గరేదో పనితగిలిందట. అందుకని సెక్రటరీతో చెప్పి పేరు ఆఖర్నవచ్చేలా చూసుకొంది. ఆమెని గుమ్మందగ్గర కలిసి బాలు, 'మూగరాత్రి చీకటినీడ' పాటపాడమని చెప్పాడన్నాను. ఆవిడ కొంచెం ప్రసన్నయై నెమ్మదిగా వేదిక మీదకెక్కి అదే శ్రావ్యంగా అందుకుంది. అంతే యింక ఆపిందాకా జనం గోల మానలేదు. ఆవిడ అహందెబ్బతిని విసురుగా దిగివచ్చి తిన్నగా ఇంటికి వెళ్ళిపోయింది. యిదంతా బాలు వేసిన ప్రాక్టికల్ జోక్అని ఆవిడ అభిప్రాయం. ఆ తర్వాత బాలు కలుసుకునుంటాడు."

"నీదినిజంగా జయంట్ బ్రెయిన్ రాధీ !" గోపాలం ట్రిబ్యూట్ యిచ్చాడు రాధకి.

